# పూజ్య స్వామి శ్రీ నిత్యానందస్వామివారి

# సంక్షిప్త జీవితము

లోకమున బ్రహ్మనిష్ఠులు యుగకర్తలుగా పేర్కొనబడిరి. వీరి జీవితము ప్రపంచము నడచుబాటలో నడచుటకు నిర్మించబడలేదు. అవ్యక్తమగు దైవప్రేరణచే వీరి జీవితము పరోపకారమునకై వినియోగింపబడినది. ప్రాపంచిక మోహము ఈజీవన్ముక్తులను కొంచెమైనను చలింపజేయలేదు. 'అహం'ను విస్మరించి, ఎల్లెడల సమాన భావమును కలిగియుండి, నిర్లిప్తతతో ఈ జీవితమునందే వారు నిర్వాణమును పొందిరి. ఇట్టివారి జీవితములే సంసారసాగరమున మునుగు మానవుల అజ్ఞానమును నశింపజేసి మోక్షమార్గమున వారిని ప్రవర్తింపజేసి వారి జీవితములను ప్రకాశవంతముగ జేయును. శ్రీనిత్యానందస్వామివారి జీవితము ఈ యుద్దేశ్యముతోనే ఇక్కడ వ్రాయబడుచున్నది.

ఉత్తరహిందూదేశమున 'మీరట్'కు సమీపమునందు 'పరీక్షితగఢ'మను గ్రామమున సంధ్యావందనము, దేవతార్చన, వేదశాస్త్రాధ్యయనము మున్నగు ఉన్నతసంస్కారములుగల ధార్మిక బ్రాహ్మణకుటుంబమునందు విక్రమశకమున 1923 సంవత్సరమున (1866 A. D.) జ్యేష్ఠ బహుళ పాడ్యమి రోజున శ్రీవారు జన్మించిరి. పూర్వాశ్రమమున వారి నామధేయము 'రామప్రసాద్'. వారి తండ్రిగారి పేరు రామకృష్ణపంత్.' బాల్యమునందే తల్లిదండ్రులు మృతిచెందినందున పితామహుని చెంతనే పెరిగి ఆయన పెద్దవాడయ్యెను. ప్రపంచమునందు విరక్తి కలిగి దానిని విడనాడవలెనను తీవ్రమైన కోరిక కలిగెను. సత్సంగమునకు వారు ఒకమారు చిత్రకూటమునకు వెళ్ళిరి. అక్కడ 'సిద్ధజీ' అను పేరుగల ఒకమహాత్ముని సాన్నిధ్యమున

24 లక్షల గాయత్రీజపముచేసి పురశ్చరణ పూర్తిగావించిరి. కాశీలో శాస్త్రాధ్యయనము ముగించి గృహమును విసర్జించి పాదయాత్రతో 'పుష్కరరాజ్', 'డాకోర్', 'పూరీ శ్రీజగన్నాథము' మున్నగు స్థలములను సందర్శించిరి. విక్రమశకము 1946 సంవత్సరమున (1889A.D) సౌరాష్ట్రములో రాజకోటసమీపమున 'త్రింబా'లో బాణగంగా నదీతీరమున నివాసము నేర్పరచుకొనిరి. ఇచ్చటనే నివసించుచు సౌరాష్ట్రమందలి పుణ్యక్షేత్రములను సందర్శించిరి. సాలిగ్రామపు సగుణోపాసనయందు వారిమనస్సు లగ్నమై యుండెను. నిర్గుణోపాసనమువైపునకు మొగ్గలేదు. 'త్రింబా'లో మహాత్ములగు జగన్నాథస్వామివారు వారికి నిర్గుణోపాసనమును బోధించిరి. యథావిధిగా దీక్ష గైకొనమని కూడ చెప్పిరి. తమది బ్రాహ్మణశరీరము కానందున స్వయముగ దీక్షను ఈయలేదు. కాని భావనగరు నందున్న దండిసన్యాసివద్దకు వెళ్లి యథావిధిగా దీక్ష గైకొనమని చెప్పిరి. రామప్రసాదులకు మరియొకరిని గురువుగా స్వీకరించుటకు ఇష్టము లేదు. అయినను జగన్నాథస్వామివారి యాజ్ఞను పాలించి భావనగరుకు బయలుదేరిరి. మార్గమధ్యమున 'సిహోర'అను గ్రామమున శ్రీకపిలానందస్వామివారి దర్శనము లభించెను. వారి సన్నిధిని యథావిధిగా దీక్ష గైకొని 'నిత్యానందసరస్వతి' యను పేరును పొందెను. అప్పుడు వారివయస్సు 27 సంవత్సరములు.

శ్రీనిత్యానందస్వామివారు పూర్ణత్యాగి. ఒకప్పుడు నిరాహారిగాను మరియొకప్పుడు ఆకులు అలములతోను కాలక్షేపము చేసెడివారు. ఏకాంతము వారికి ఇష్టము. లాఠీపట్టణముదగ్గర 'ఆంసోదర్' గ్రామమున కొంతకాలముండి గీత, ఉపనిషత్తులు, పంచదశి, యోగవాసిష్ఠము మున్నగుగ్రంథములను జనులకు ఉపదేశించుచుండిరి. ఉపదేశసమయమున ఒకప్పుడు వారి నేత్రములనుండి

అశ్రువులు కారుచుండెడివి; శరీరము నిశ్చేష్టమై మాట వెలువడేది కాదు. వారికి గురుత్వమును స్వీకరించుట ఎంతమాత్రము ఇష్టమయేది కాదు. అయినను వేలకొలది మహనీయులు వారిని గురువుగా భావించి పూజించుచుండిరి.

విక్రమశకము 1969 సం॥న (1912 A. D) వారు 'రాజకోట' లో ప్రప్రథమముగా శ్రీప్రకాశానందస్వామివారిని కలసికొనుట తటస్థించెను. అదిమొదలు వారిద్దరికి పరస్పరము ఆత్మీయభావము పెంపొందెను. తరువాతకూడ వారిద్దరు అప్పుడప్పుడు కలసికొనుచుండిరి. ఈ యిద్దరు త్యాగులు కలసినప్పుడెల్ల తత్త్వవిచారము, వైరాగ్యము, మోక్షము మొదలగు ఆధ్యాత్మికవిషయములపై రసవత్తరములైన చర్చలు జరుగుచుండెడివి. అచ్చట సమావేశమయిన భక్తులు ఆచర్చలను విని శ్రేయఃపథమున పురోగమించుచుండిరి.

శ్రీస్వామివారి జీవితము చివరవరకు తీవ్రవైరాగ్యము ననుసరించెను. వైరాగ్యము జ్ఞానికిని అజ్ఞానికిని, ఇరువురకును కలుగును. అజ్ఞానివైరాగ్యము కాలాంతరమున నశించును. ఏలనన, అజ్ఞానికి తాత్కాలిక దోషదృష్టిచే వైరాగ్యము కలుగును. ఆదోషములు నశించుటతోడనే తిరిగి విషయములందు అనురాగము కలుగును. జ్ఞాని దోషదృష్టిద్వారా పూర్ణవైరాగ్యమునొంది సమాధియందు బ్రహ్మసుఖమును అనుభవించును. ఆతడు తుచ్ఛమైన విషయసుఖమునకు మరలడు. కఠోపనిషత్తునందు యమధర్మరాజు ఇట్లు చెప్పెను:—

*పరాచః కామాననుయన్తి బాలాస్తే మృత్యోర్యాన్తి వితతస్య పాశమ్ ।*
*అథ ధీరా అమృతత్వం విదిత్వా ధ్రువమధ్రువేష్విహ న ప్రార్థయన్తే॥*

"అజ్ఞానులు బాహ్యకామములను అనగా విషయసుఖములను పొంద ప్రయత్నింతురు. వారు ఎల్లెడల వ్యాపించియున్న మృత్యువు యొక్క పాశమున చిక్కుపడుదురు. జ్ఞానులు అమృతస్వరూపము

ఘుప్రవము నయిన బ్రహ్మాసుఖమును తెలిసికొని ఇచ్చటి నశ్వరములను తుచ్ఛపదార్థములను కోరరు.”

జ్ఞానులకు కలుగు జ్ఞానము పైకి కన్పించునదికాదు. అది అనుమానప్రమాణముచే గ్రహింపదగినది. అరణ్యమునందలి మానవునకు పర్వతశిఖరమందు ధూమము కన్పించును. అగ్ని కన్పించదు. అగ్నికిని ధూమమునకును గల నిత్యసంబంధమును వంటింటిలో ప్రత్యక్షముగా చూచియున్నందున ధూమమున్నచోట అగ్నియుండునను వ్యాప్తిజ్ఞానము కలుగును. దానివల్ల పర్వతశిఖరమందు ప్రత్యక్షముగా అగ్ని కాన్పించకపోయినను ధూమమునుబట్టి అగ్నియున్నట్లు గ్రహించును. ఇచ్చట అగ్ని అనుమానప్రమాణముచే గ్రహింపబడినది. ఇట్లే జ్ఞానియందలి జ్ఞానము అనుమానముద్వారా గ్రహింపబడును. ఈవిషయమున శ్రీశంకరభగవత్పాదు లిట్లు సెలవిచ్చిరి:—

*బన్ధో మోక్షశ్చ తృప్తిశ్చ చిన్తారోగ్య క్షుధాదయః ।*
*స్వేనైవ వేద్యా యద్జ్ఞానం పరేషామానుమానికమ్ ॥*

“బంధము, మోక్షము, తృప్తి, చింత, ఆరోగ్యము, ఆకలి మున్నగునవి తనకు కలిగినపుడు తనకే తెలియనగును. ఇతరులకు అవి అనుమానప్రమాణముచే తెలియును.” కావున జ్ఞానియందలి జ్ఞానము నూహించుటకు ఈక్రింది జ్ఞానలక్షణము సహాయపడును.

*అక్రోధవైరాగ్య జితేన్ద్రియత్వం క్షమా దయా సర్వజనప్రియత్వమ్ ।*
*నిర్లోభదాతా భయశోకహర్తా జ్ఞానస్య చిహ్నం దశలక్షణాని ॥*

క్రోధరాహిత్యము, వైరాగ్యము, జితేంద్రియత్వము, క్షమ, దయ, సర్వజనప్రియత్వము, లోభరాహిత్యము, దాతృత్వము, నిర్భయత్వము, శోకరాహిత్యము—ఈపది లక్షణములు జ్ఞానచిహ్నములు. ఈసద్గుణములన్నియు శ్రీస్వామివారియందు ఎల్లప్పుడు కనవచ్చుటచే వారు జ్ఞానులని అందరికి తెలియుచుండెను. ఈసద్గుణపరిపూర్ణులైన

శ్రీస్వామివారినిగూర్చి శ్రీప్రకాశానందస్వామివారి ట్లు నుడివి యుండిరి:—

"నేను కచ్ఛ, గుజరాత్, సౌరాష్ట్రిలలోని మహాత్ములలో అగ్రగణ్యులను ఎరుగుదును. గీత రెండవ అధ్యాయములో వర్ణించిన 'స్థితప్రజ్ఞ' ని లక్షణములుకల మహాత్ములలో మొదటివారు 'కచ్ఛ' లోని పూజ్య శ్రీనారాయణానందస్వామివారు, రెండవవారు 'అహమదాబాద్' నందలి పూజ్య శ్రీ సరయూదాస్ మహారాజుగారు, మూడవవారు 'చరోతర్'లోని పూజ్య శ్రీజానకీదాసస్వామివారు, నాల్గవవారు 'సౌరాష్ట్ర'లోని పూజ్య శ్రీనిత్యానందస్వామివారు."

ఈనలుగురు మహాత్ముల గురించి పరమపూజ్య శ్రీప్రకాశానంద స్వామివారు సంగ్రహముగా నీక్రింది పరిచయవాక్యముల నొసంగిరి.

విక్రమశకము 1956 సం॥న (1899 A. D.) శ్రీప్రకాశానంద స్వామివారు 'కచ్ఛ' వెళ్ళినప్పుడు శ్రీనారాయణానందస్వామివారు అచ్చట ఉండిరి. అప్పుడు వారివయస్సు సుమారు 70, 72 సం॥లు ఉండును. వారు ఒకగ్రామమున స్థిరముగా నుండుటగాని, బండి మొదలగు వాహనములను అధిరోహించుటగాని లేదు. 'కచ్ఛ'యందలి ప్రజలు వారియందు అపరిమితమైన పూజ్యభావమును కలిగియుండిరి. వారి సన్నిధానమున అచ్చట శ్రీప్రకాశానందస్వామివారు 40 రోజులు సత్కాలక్షేపము చేసియుండిరి.

విక్రమశకము 1957 సం॥న (1900 A. D.) శ్రీప్రకాశానంద స్వామివారు 'అహమదాబాదు' వెళ్ళినప్పుడు శ్రీసరయూదాసుగారిని కలిసికొనిరి. వారు 'అహమదాబాదు'లో 'ప్రేమదర్వాజా' చెంతనున్న ఒక సదావృత్తిస్థలమున నివసించుచుండిరి. శ్రీప్రకాశానంద స్వామివారు వారితో సద్గోష్ఠి సల్పుటకు తరచుగా వెళ్ళుచు వచ్చుచుండెడివారు.

ఈ పైనలుగురు మహాత్ములు కూడ శాస్త్రములయందు చెప్ప బడినట్లు అంతరంగమునను, బాహ్యమునను త్యాగమును నిర్వహించు చుండిరి. వీరిలో ఎవరికిని శిష్యులుగాని, ఆశ్రమముగాని, మఠముగాని లేవు. నిష్కళంకమైన వారిప్రవర్తనమునుబట్టి 'మహాత్యాగులు' గా ప్రజలలో వారు ప్రసిద్ధికెక్కిరి.

పూర్వము జనులు మాయాజన్యపదార్థములయందు వైరా గ్యము కలిగిన యనంతరము సద్గురుస్వామ్రాశ్రయించి సన్యాసదీక్షను స్వీకరించుచుండెడివారు. దీక్షనిచ్చు గురువులుకూడ శిష్యుడు కులీ నుడు, శుద్ధాత్ముడు మొదలగు గుణములను కలిగియుండుటకు ప్రాధాన్య మొసగుచుండిరి. ఇందుకు శాస్త్రములలో చెప్పినట్లు పరీక్షచేసి అధికారార్హతలను గమనించి సన్యాసదీక్షను ఒసగుచుం డిరి. కులీనుడైనచో శాస్త్రవిరుద్ధములైన నీచకార్యములను చేయడని యుద్దేశ్యము.

*వనేఽపి సింహా మృగమాంసభక్షిణో బుభుక్షితా నైవ తృణం చరన్తి।*
*ఏవం కులీనా వ్యసనాభిభూతా న నీచకర్మాణి సమాచరన్తి॥*

మృగమాంసమును భక్షించు సింహములు ఆకలివేసినను గడ్డి తినవు. అట్లే కులీనులు కూడ ఎట్టి ఇక్కట్లు వచ్చినను నీచకర్మ లను చేయరు. కులీనులు శాస్త్రవిరుద్ధముగా సంచరించి ధనాది మాయాజన్యపదార్థములను ఆర్జించుట మొదలగు నీచకర్మలను చేయరు. అట్టివారికి సన్యాసమునిచ్చినచో ఆసన్యాసవేషమునకు కళం కము, అప్రతిష్ఠ రానీయరని వారి యుద్దేశ్యము.

ఈరోజులలో కొందరు జీవనోపాధిగానో, కుటుంబక్లేశముల మూలముననో, లేక ఇతరకారణములవలననో సన్యాసము స్వీకరించి మిసమిసలాడు వేషమాత్రముననే సన్యాసులుగా కన్పట్టుచున్నారు. ఈవిషయమున భక్తుడు 'అఖా' ఇట్లు చెప్పియున్నాడు:—

"వేషపహారీ విటంబణా భయీ, పంథయుం దూధున థాయి దధి"

ఇట్లు వేషమునుధరించి సన్న్యాసాశ్రమమునకు వెళ్ళువారు అపాయమునకు లోనగుదురు. విరిగిపోయిన పాలకు పెరుగురుచి వచ్చునా? ధర్మము, వైరాగ్యము, త్యాగము మున్నగునవి వారికి అబ్బవు. అందుచే వారుఉభయభ్రష్టులగుదురు. శ్రీమద్భాగవతమున కలియుగవర్ణనమునందు "లింగమేవాశ్రమఖ్యాతౌ" అనిచెప్పబడినది. ఆశ్రమప్రతీతికిమాత్రమే చిహ్నములు. దండము, కమండలము, కాషాయాంబరము మొదలగునవి ఆశ్రమప్రతీతికి మాత్రమే ఉపయోగపడును.

నేడు ఎంత వెదకినను తీవ్రవైరాగ్యముగల సిసలైన సన్న్యాసి కాన్పించుటలేదు. అంతేకాదు. మందవైరాగ్యము కల వారుకూడ కన్పించుట చాల అరుదైనది. కేవలము పేరు, వేషము ధరించిన సన్న్యాసులుమాత్రము విరివిగా కాన్పించుదురు. ఇట్టివార్లలో మాయికపదార్థములయందు సరియగు త్యాగమెట్లుండును? అసలైన త్యాగి వేయికి ఒకడైనను ఉండుట దుర్లభము. ఒక మహా పురుషుడు ఇట్లు చెప్పినాడు:—

**అపి రాజ్యం నరకవత్ స్వర్ణం పశ్యేచ్చ లోష్టవత్,**
**స్త్రియం శవవత్ పశ్యేద్యస్తాదృగ్దుర్లభో యతిః॥**

"రాజ్యమును నరకముతో సమానముగాను, బంగారమును మట్టితో సమానముగాను, స్త్రీని శవముతో సమానముగాను చూచు సన్న్యాసి లభించడు."

ఇట్లు శాస్త్రములందు వర్ణించబడిన గుణములుగల పరిపూర్ణ త్యాగులు అయిన పైనలుగురు మహాత్ములు ఆయాప్రదేశములలో ఆదర్శ త్యాగులుగా సంచరించియుండిరి. వీరిలో శ్రీసరయూదాసుగారి 'గిత ము వారి సదుపదేశములతోగూడ 40, 45 పుటలలో

శ్రీ ప్రకాశానందస్వామివారి మిత్రులగు శ్రీస్వయంప్రకాశతీర్థుల వారిచే 34, 35 సం॥లకు పూర్వము వ్రాయబడినది. ఈమధ్యనే శ్రీనిత్యానందస్వామివారి జీవితముకూడ సంక్షేపముగా వ్రాయబడెను.

విక్రమశకమున 1966 సం॥న (1909 A. D) శ్రీనిత్యానంద స్వామివారిని మూల్వాలారాజుగారు 'పీరడియా' గ్రామమునకు తీసికొనివచ్చిరి. అప్పటినుండియు వారు అక్కడనే ఉండిరి. విక్రమశకమున 1991 సం॥న (1934 A. D) ఫాల్గుణశుద్ధ పూర్ణిమరోజున బ్రహ్మనిష్ఠులగు శ్రీనిత్యానందస్వామివారు ప్రణవనాదమును భజనకీర్తనలను శ్రవణముచేయుచు శ్రీప్రకాశానందస్వామివారి సన్నిధానమున బ్రహ్మీభూతులైరి. శ్రీనిత్యానందస్వామివారి జ్ఞానామృతమును గ్రోలిన వారందరును అంతఃకరణమున ఆత్మతత్త్వోపదేశపు ప్రకాశమును అనుభవించుచునే యుందురు.

హరిః ఓమ్ తత్సత్